# నాణేనికి అటూ ఇటూ

ఎం. నిర్మల

సాయంత్రం నాలుగు గంటలు. స్కూలు వదిలేశారు. పిల్లలంతా వెళ్ళేందుకు సిద్ధమైనారు. గేటు దగ్గర నిలబడి ఆయా ఒక్కొక్కళ్ళనే వరుసగా బయటికి పంపిస్తోంది.ఎవరి వాళ్ళకి, వాళ్ళని క్యారేజి బుట్టలతో సహితంగా అప్పగిస్తోంది. పిల్లలంతా ఆయాకి చేతులూపుతూ వెళ్ళిపోతున్నారు. ఇంతలో గేటు దగ్గర ఓ రిక్షా ఆగింది. అందులోనుండి దిగిన వ్యక్తిన చూడగానే ఆయా అలాగే నిలబడి పోయింది.

"ఆయా! నాబుట్ట ఇవ్వు " ఎవరో పిల్లలు అడుగుతున్నారు. యాంత్రికంగా పనిచేస్తున్నదన్న మాటేగాని, దృష్టిమాత్రం రిక్షాలోనుండి దిగిన వ్యక్తి మీదే వుంది. ఆయా అనబడే శాంతకి.

"అమ్మా! నేనమ్మా! అలా నిలబడిపోయావేమిటి " వచ్చిన వ్యక్తి అడుగుతూ వుంటే తేరుకుని గేటు బాధ్యత ఇంకొక ఆయాకి పురమాయించి కూతురితో కలసి స్కూలు వెనకనే వున్న హాస్టలుకి వచ్చింది. తను ఉండే గదిలోకి రాగానే కూతురి నుండి ఎదురైన మొదటి ప్రశ్న

"టెలిగ్రాం అందలేదా నీకు "

"అందింది " పొడిగా సమాధానం చెప్పింది.

"అయితే మరి నువ్వెందుకు రాలేదు"

"రావాలన్పించలేదు. రాలేదు. అయినా రావలసిన అవసరం కనిపించలేదు.'

"అలా మాట్లాడతావేమిటి? రావలసిన అవసరం లేదా? అక్కడ నీగురించి అంతా ఏమనుకుంటున్నారో తెలుసా? నువ్వు రాలేదంటే బహుశః నీకు విషయం తెలిసి ఉండదనుకున్నానే కానీ, ఇలా తెలిసీ రాలేదని అనుకోలేదు. అందుకే గబగబా పరుగెత్తుకు వచ్చాను."

ఏమీ మాట్లాడలేదు శాంత. శిలలా వుండిపోయింది. నిజమే. భర్త చనిపోయాడని టెలిగ్రాం వస్తే గుండెలు బాదుకుంటూ పరుగెత్తుకు రాని భార్యని గురించి నలుగురూ ఏమనుకుని ఉంటారో ఊహించలేకపోలేదు తను. తన గురించి ఇన్ని మాటలు మాట్లాడిన ఈనోళ్ళు ఆనాడు మూతపడి పోయాయేం? ఆనాడు తనకి అన్యాయం జరిగినపుడు ఏ ఒక్కరూ తనతరపున ఆయనకెందుకు నచ్చచెప్పలేక పోయారు?ఈనాడు ఏముఖం పెట్టుకుని తన గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. శాంత మనసు గతంలోకి వెళ్ళింది. సరిగ్గా రెండేళ్ళ క్రితం ఓ అర్ధరాత్రివేళ అదే వ్యక్తి తనని నిర్దాక్షిణ్యంగా నడివీధిలోకి గెంటినపుడు వీళ్ళెవరూ అడ్డుపడలేదు. ఇంట్లో ఉన్నవాళ్ళు కూడ తనని అతను పెట్టిన బాధలు ఇన్నీ అన్నీకావు. తాగివచ్చి పేకాడి జీతం అంతా పోగొట్టుకున్న రోజుల్లో కూడ అతనిని ఒక్కమాట అనకుండా అదే ఇంట్లో ఓర్పుతో జీవించింది. దాదాపు ఇరవైయేళ్ళు ఆనరకం అనుభవించింది. మంచానపడి రోగంతో ఉంటే ఆరునెలల పాటుకంటికి రెప్పలా కాపాడింది. కనీసం ఆదరించి మాట్లాడారా? కష్టమైనా, సుఖమైనా, చావైనా, బతుకైనా



అక్కడే ఉండాలి అన్నారు. ఇప్పుడు అందరూ తనని ఆడిపోసుకుంటున్నారంటే అర్థం ఏమిటి? రెండేళ్ళుగా తను ఒంటరిగా బతుకుతోంది. అతనికి తనపట్లలేని బాధ్యత తనకి మాత్రం ఎందుకుండాలి.

"కన్నతల్లివి కాకపోయినా, అంతకంటె ఎక్కువగా పెంచావు నువ్వు. అందుకే అందరూ నిన్ను అన్ని మాటలంటుంటే సహించలేక అసలు విషయం నీకు చెప్పిపోదామని వచ్చాను." కూతురు సంభాషణ పొడిగిస్తోంది.

కనీసం సవతి బిడ్డకైనా ఆ మాత్రం అభిమానం ఉంది ఈతల్లిపట్ల. రెండో పెళ్ళివాడు, ముగ్గురు బిడ్డల తండ్రి అనికూడ ఆలోచించకుండా తను పెళ్ళికి సిద్ధపడింది. తనున్న నిస్సహాయస్థితిలో. తల్లిదండ్రీలేని తనకి డబ్బుఖర్చుపెట్టి మంచిసంబంధం తెచ్చి పెళ్ళిచేసే స్థితి తన అన్నదమ్ములెవరికీ లేదని తెలుసు. పుట్టింట్లో తను చేస్తున్న పనే భర్త ఇంట్లో చేయటానికి సిద్ధపడింది. తనలాగే తల్లిలేని పిల్లలకి ఆప్రేమ అందించాలని తాపత్రయ పడింది. చివరికి ఏంజరిగింది. తన సుఖం సంతోషంతప్ప అతనికి ఇల్లుపట్టదని అర్థమయ్యేసరికి సగం జీవతం గడిచిపోయింది. అతనికి ఇంట్లో పిల్లలకి చాకిరీ చేసే మనిషే కాని భార్య అవసరం ఎంత మాత్రం లేదు. తనకంటే వయసులో చాలచిన్నదైన భార్యమీద చెప్పలేని అనుమానం. పిల్లలు బాధ్యత తీరేవరకే అతనికి తను అవసరం అయింది. ఆ అవసరం తీరాక భార్య అనే వ్యక్తి ఏమైపోయినా అతనికి సంబంధం లేదు. ఎక్కడైనా రెండవ భార్యంటే అపురూపంగా చూసుకుంటారు. కానీ తన దురదృష్టానికి కనీసం భార్యస్థానానికి కూడ నోచుకోలేదు. ఇప్పుడే కూతురు తండ్రి తరపున తనని ప్రశ్నిస్తోంది.

"చూడు పద్మా! నువ్వడిగిన ప్రశ్నకి సమాధానం నేను చెప్పినా నీకు అర్థం కాదు. అది అనుభవించిన నాకు మాత్రమే తెలుసు.

"అమ్మా! నీబాధ నేను కొంతవరకు అర్థం చేసుకోగలను. కానీ ఈ వయస్సులో నీకీ పంతం ఏమిటమ్మా? ఒకటి మాత్రం నిజం. ఆయన ఎంత చెడ్డవాడైనా నీభర్త, ఇప్పుడు నువ్వు చేసిన పనిలోకం హర్షించదు. నువ్వు పొరపాటు' చేశావని నేననుకుంటున్నాను. కనీసం ఆ పదోరోజుకైనా నువ్వు అక్కడికి వస్తే బాగుంటుంది. నేవేడుతున్నాను. ఆపైన నీ ఇష్టం."

నిజమే కూతురు చెప్పినట్లు పంతాలకి పోయేవయసుకాదు. ఆవేశపడే మనసూ కాదు. అసలు తను అలాంటి మనిషేకాదు. కానీ ఎవరు తన బాధను అర్థం చేసుకుంటారు. వెళ్ళిపోతున్న కూతురిని ఆపలేదు శాంత.

టక టక ! తలుపు చప్పుడైతే వెళ్ళి తీసింది శాంత. ఎదురుగా అన్నదమ్ములు నిలబడిఉన్నారు. తలుపులు పూర్తిగా తెరిచి వాళ్ళని లోపలికి రానిచ్చింది. తనమీద సానుభూతితో ఇప్పటికైనా వచ్చిన తనవాళ్ళని చూసినమ్మలేకపోయింది. లోపలికి అడుగు పెడుతూనే పెద్దన్నగారు మొదలు పెట్టాడు.

"హు ! ఇంతకు తెగిస్తావనుకోలేదు. మొగుడుఛస్తే ఆఖరుసారి చూడటానికి రాలేదు సరికదా! తగుదునమ్మా అని బొట్టు పూసతీయకుండా తిరుగుతున్నావా? కనీసం మనసులో కూడ బాధ లేదేమిటి? ఇది మర్యాదస్తులు చేసే పనేనా? నీకెంత సిగ్గు లేదే? మా పరువు నిలువునా తీశావు కదే! గబాగబా అడిగేశాడు.

ఒక నిముషం ఆగి ఆమె స్థిరంగా అంది. "అయినాయా నీ ప్రశ్నలు. ఇంకా ఉన్నాయా! అవికూడ అడిగెయ్. అప్పుడు చెపుతాను సమాధానం. అయినా దీనికోసం మీ అందరూ కట్టకట్టుకుని వచ్చారా? నేనిలా ఎందుకు చేయవలసి వచ్చిందో మీరెవరైనా నా తరపు నుంచి ఆలోచించారా? ఏడ్చేందుకు, బాధపడేందుకు కన్నీళ్ళులేని రాయిలా నా మనసు ఎందుకు బండబారిందో మీకెవరికైనా తెలుసా? భర్తచచ్చిపోతే చూడటానికి రాలేదని నన్నడుగుతున్నారే, అదే భర్త నన్ను అర్ధరాత్రి నడివీధిలోకి నెట్టినపుడు కల్పించుకున్నారా? నా వైపు నిలబడి ఇది అన్యాయమని మీరెవరైనా నిలదీశారా? కనీసపు సానుభూతితో నాకోదారి చూపించారా! ఇవేవీ చెయ్యలేదు సరికదా రెండేళ్ళనుండి వంటరిగా నా బతుకు నేను బతుకుతున్నానని తెలిసి కూడా ఎలా ఉన్నానో చూడాలని కూడా అన్పించలేదు మీకు? ఎందుకురా ఈరోజు పరువు మర్యాదల గురించి మాట్లాడతారు! అర్ధరాత్రి నేనెక్కడికి పోగలను అని ఆలోచించకుండా అతను నన్ను బయటికి నెట్టినపుడు ఎంత బతిమాలా నో మీకేంతెలుసు? పైగా తెల్లవారే వరకు కూడా ఉండటానికి వీల్లేదని తక్షణమే బయటకి నడవమన్న ఆ పెద్దమనిషి గురించి నేను బాధపడాలా. ఆయనపక్షం వహించి మీరు నన్ను నిలదీయటానికి వచ్చారా! అవునురా! మీరుకూడ అదే జాతికదా! ఆవైపు నుండే ఆలోచిస్తారు. నాణేనికి ఒకవైపునే చూడగలరు. రెండోవైపు చూస్తే మీకు తెలిసి ఉండేది. అయినా స్వంత అన్నదమ్ములకే లేని సానుభూతి పరాయి వాళ్ళదగ్గరనేనెలా ఆశించగలను. ఇక తాళి బొట్టు తీసెయ్య లేదని అడుగుతున్నారే. ఎక్కడుందిరా న్యాయం. తాళిబొట్టు! ఇంకెక్కడి తాళిరా! నన్ను వీధిలోకి గెంటిన రోజే ఆ వ్యక్తి దాన్ని నా మెడలోనుండి తీసేశాడురా! నాకూ తనకీ ఏమీ సంబంధం లేదు. నేను తనకి చచ్చిన దానితో సమానమని. ఒకవేళ నేను దాన్ని అమ్ముకుంటానని భయపడ్డాడేమో. ఆనాడే నువ్వీప్రశ్న మీ బావనడిగి వుండవలసింది. నువ్వు తికి వుండగానే నా చెల్లెలి మెడలో తాళి ఎందుకు తీశావని. ఈనాడు ఎందుకు తియ్యలేదని నన్నడుగుతున్నావా? అసలు నా మెడలో తాళి వుందో లేదో తెలియని మీకు ఈ ప్రశ్నఅడిగేహక్కులేదురా? ఇంకో విషయం. నామీద అనుమానంతో తనుబతికి ఉండగానే నా అందమైన జుట్టు కత్తిరించి వికృతంగా నన్ను విధవరాలిని చేసి శిక్షించాడురా ఆ పెద్దమనిషి. ఇంక బొట్టు విషయమంటారా? పెళ్ళికి ముందు నుండి అది నేను పెట్టు కుంటు న్నాను. అదితీయవలసిన అవసరం లేదు. అతను ఉండి కూడ లేని బతుకును ఇంతకుముందే అనుభవించాను. రెండేళ్ళనాడు ఎలా ఉన్నానో ఇప్పుడుకూడ అలాగే వున్నాను. అప్పుడే ఈ ప్రశ్న నువ్వు అడిగివుంటే బాగుండేది. ఇంకా ఇప్పుడు నీ కోరిక ప్రకారం నేను అనుభవించే వైవిధ్యం ఏముందిరా! ఇప్పుడు చెప్పు. నేనింకా అనుభవించవలసిన దేముందో? నువ్వేకాదు. ఎవరూ చెప్పలేరు. దానికి సమాధానం నేనే చెప్పగలను. చెప్పానుకూడ. ఇకదయచెయ్.

భళ్ళున తలుపేసేసింది ఆమె.